
# ఏజెంట్ X

యెదుళ్ల సురేష్ రెడ్డి

## జెన్నిఫర్ మైల్స్



**న్యూయార్క్ జాక్సన్ హైట్స్‌లోని 82వ వీధి...**

**మరో కొద్దిసేపట్లో చీకట్లు కమ్ముకోబోతాయనగా ఆ వీధిలోకి ప్రవేశించింది జెన్నిఫర్ మైల్స్.**

**దాదాపు 26 సంవత్సరాల వయసుంటుం దామెకు. అందమే ఆమెను చూసి అసూయపడేంత అందగత్తె ఆమె. మామూలుకన్నా కాస్త పొడగరి, అందుకు తగ్గ ఆరోగ్యవంతమైన శరీరం, పసుపుపచ్చని మేని ఛాయ, నీలి కళ్లు, గుండ్రటి అమాయకమైన మొహం, ఎప్పుడూ పెదవులపైన కదలాడే అమాయకమైన చిరునవ్వు ఆమె ఆభరణాలు, చూపుల్ని కట్టిపడేసే ఆమె సౌందర్యానికి ముగ్ధులవనివారు ఎవరూ ఉండరంటే అతిశయోక్తి కాదు.**

ఆ వీధికి ఒక పక్కగా నిలబడి చుట్టూ చూసిం దామె. ఒకరిద్దరు పాదచారులు తప్ప వీధి మొత్తం నిర్మానుష్యంగా ఉంది. తన నెవరూ గమనించడం లేదని నిశ్చయించుకోగానే తన హ్యాండ్ బ్యాగ్‌లో నుండి సిగరెట్ లైటర్ సైజులో నల్లటి గుడ్డలో చుట్టి ఉన్న వస్తువు నొకదాన్ని బయటకు తీసి దాన్ని పక్కనే ఉన్న భవంతి ప్రహరీ గోడకు ఉన్న రంధ్రంలో పడేసి వేగంగా అక్కడి నుండి వెళ్లిపోయింది.

ఆమె వెళ్లిన కొద్దిసేపటికే ఆ భవనపు యజమాని అక్కడకు వచ్చాడు. ఆ ప్రహరీ గోడపైన పెరిగిన మొక్కల్ని తీసివేస్తున్న అతనికి గోడ రంధ్రంలో ఉన్న ఆ వస్తువు కన్పించింది. ఆసక్తిగా దాన్ని బయటకు తీసి విప్పి చూసిన అతనికి నల్లటి గుడ్డలో చుట్టి ఉన్న కాగితాలు కన్పించాయి. వాటిని చదివేకొద్దీ అతను విస్మయంతో కదిలిపోయాడు. అమెరికాలోని వివిధ దేశాల రాయబార కార్యాలయాలకు సంబంధించిన సమాచారంతోపాటు ఎంతో మంది ప్రభుత్వాధికారులూ, వ్యాపారవేత్తలు, జర్నలిస్టుల గురించిన విషయాలు అందులో రాసి ఉన్నాయి. వాటి క్రింద మేరీ అన్న సంతకం ఉంది. ఆ కాగితాల్ని ఆ గోడ రంధ్రంలో ఎవరు పెట్టారో అతనికి అర్థం కాలేదు. అందులో ఉన్న రహస్య సమాచారానికి కలవరం చెందిన అతను వెంటనే ఆ విషయాన్ని ఎఫ్.బి.ఐ.కి తెలియజేశాడు.

ఆ కాగితాల్లోని వార్తల ఆధారంగా పరిశోధన ప్రారంభించిన ఎఫ్.బి.ఐ.కి త్వరలోనే అసలు విషయాలు తెలిశాయి. మేరీ అన్న పేరుగల ఆ గూఢచారిణి వాషింగ్టన్‌లోని దక్షిణాఫ్రికా రాయబార కార్యాలయంలో పని చేస్తున్న జెన్నిఫర్ మైల్స్ అన్న విషయం తెలిసినా వాళ్లు ఆమెను అరెస్టు చేయలేదు. ఆమె ఎవరి తరపున గూఢచారిణిగా పనిచేస్తోందో వారికి అర్థం కాలేదు. పైగా ఆమెను అరెస్టు చేయడానికి సరియైన సాక్ష్యాలు కూడా ఏమీ లేవు. అలాంటప్పుడు తొందరపడడంకన్నా జాగ్రత్తగా ఆమె పైన నిఘా వేసి, మిగతా వివరాలన్నీ తెలుసుకోవడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చిన వాళ్లు ఆమెను గమనించడం ప్రారంభించారు.

* * *

దక్షిణాఫ్రికాలోని కింబర్లీలో ఒక మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన జెన్నిఫర్ బాల్యమంతా అక్కడి వజ్రాల గనుల మధ్యన గడిచింది. చిన్నప్పటి నుండీ ఎంతో ధైర్యంగానూ, చురుకుగానూ ఉన్న ఆమె చదువు పూర్తయిన తరువాత గుమాస్తాగా ఉద్యోగంలో చేరింది. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే రాత్రిళ్లు అక్కడి డ్యాన్స్ థియేటర్‌లో కోరస్ గర్ల్‌గా ప్రదర్శనల్లో పాల్గొనేది. ఆ తరువాత తన ఇరవై రెండు సంవత్సరాల వయసులో మరో ఇద్దరు స్నేహితురాళ్లతో కలిసి ప్రపంచయాత్రకు బయలు దేరిన ఆమె కేప్‌టౌన్, ఇంగ్లాండ్, యూరప్‌లోని మిగతా దేశాల్లో తిరిగి చివరికి కెనడాలోని టోరంటో స్టాక్ బ్రోకరేజ్ ఫర్మ్‌లో సెక్రటరీగా ఉద్యోగంలో చేరింది. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే రాత్రుళ్లు చదువుతూ స్టాక్ బ్రోకర్‌గా క్వాలిఫికేషన్ సంపాదించుకుని చివరికి ఆ స్టాక్ బ్రోకరేజ్ ఫర్మ్ డైరెక్టర్‌కి ప్రైవేట్ సెక్రటరీగా మారింది.

క్యూబా తిరుగుబాటు గెరిల్లా నాయకుడు చె గువారాను జెన్నిఫర్ విపరీతంగా ఆరాధించేది. తను అతనితో కలిసి ఉండాలనీ, అతనితోపాటే గెరిల్లా పోరాటాల్లో పాలుపంచుకోవాలని నిరంతరం కలలు కనేది. అతనితో కలిసి అడవుల్లో గడుపుతున్నట్టు ఊహించుకునేది. ఈలోగా చె గువారా ప్రభుత్వానికి పట్టుబడడం, ప్రభుత్వం అతన్ని చంపేయడం జరగడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురయ్యింది. చె గువారా మరణాన్ని ఆమె సహించలేకపోయింది.

గువారా ఆశయాలకు అనుగుణంగా లాటిన్ అమెరికా దేశాల్లో తిరుగుబాటును కొనసాగించడం కోసం క్యూబాకు వెళ్లాలని నిశ్చయించుకున్న ఆమె అక్కడి ఆదిమవాసి తెగలకు సంబంధించిన వివరాల్ని సేకరించే నెపంతో ఆంత్రోపాలజిస్ట్‌గా నటిస్తూ మెక్సికో ద్వారా క్యూబా రాజధాని హవానాకు చేరుకుంది. ఆ తరువాత తొందరలోనే అక్కడి వివిధ ప్రదేశాల్లో పర్యటిస్తూ అక్కడి ప్రముఖులతో పరిచయాల్ని పెంచుకుంది. కొన్ని రోజులు అక్కడి పొలాల్లో వ్యవసాయం కూడా చేసింది. తను వెళ్లిన ప్రతి ప్రదేశంలోనూ క్యూబా పట్ల తనకు ఉన్న అభిమానాన్ని స్పష్టంగా ప్రకటించిన జెన్నిఫర్ అక్కడి గూఢచార సంస్థ డి.ఐ.జి. దృష్టిలో పడడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. ఆమె పరిచయాల్ని, క్యూబాపట్ల ఆమె ప్రకటించే అంకితభావాన్ని గమనించిన డి.ఐ.జి. ఆమె కదలికల్ని పరిశీలించడం ప్రారంభించింది. చె గువారా ఆశయాలకు అనుగుణంగా లాటిన్ అమెరికా దేశాల్లో గెరిల్లా పోరాటాల్లో పాల్గొనడానికి తనకు అవకాశం కల్పించాల్సిందిగా ఆమె అక్కడి డి.ఐ.జి. అధికారుల్ని కోరడంతో ఆమె పట్టుదలను గమనించిన వాళ్లు అందుకు అంగీకరించారు.

డి.ఐ.జి. ఆదేశాల మేరకు వారి ఏజంటుగా తిరిగి కెనడాకు చేరుకున్న ఆమె అక్కడి నుండి వాషింగ్టన్‌కు వెళ్లి అక్కడి దక్షిణాఫ్రికా రాయబార కార్యాలయంలో టైపిస్టుగా ఉద్యోగంలో చేరింది. స్వతహాగా అందగత్తె అయిన ఆమెకు అవసరమైన వారితో పరిచయాల్ని పెంచుకోవడం అంత కష్టం కాలేదు. అక్కడి వివిధ దేశాల రాయబార కార్యాలయాల్లో జరిగే పార్టీలకు ఆమె క్రమం తప్పకుండా హాజరయ్యేది. ఆ విధంగా ఆమె పరిచయాలు మరింతగా పెరిగాయి. వివిధ దేశాల ఎంబసీ అధికారులు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు, అమెరికా ప్రభుత్వాధికారులూ ఆమె చుట్టూ తిరిగేవారు. వారి ద్వారా సేకరించిన సమాచారాన్నంతా కాగితాల్లో రాసి వాటిని న్యూయార్క్‌లోని ఒక ఇంటి ప్రహరీ గోడకు ఉన్న రంధ్రంలో దాచి పెట్టేది. డి.ఐ.జి. అధికారులు అక్కడి నుండి ఆ కాగితాల్ని తీసుకునేవారు. అలా ఎవరికీ అనుమానం రాకుండా రహస్యాలు చేతులు మారేవి.

అయితే అనుకోకుండా ఒక రోజు ఆ కాగితాలు ఆ ఇంటి యజమాని కంటపడడంతో ఎఫ్.బి.ఐ.కి జరుగుతున్న విషయాల గురించి తెలిసిపోయింది. ఎఫ్.బి.ఐ. జెన్నిఫర్ కదలికలపైన నిఘా వేసింది. ఆ తరువాత కొద్ది రోజులకు మళ్లీ న్యూయార్క్‌కు వెళ్లిన జెన్నిఫర్ అక్కడి డి.ఐ.జి. అధికారికి తన కాగితాలు అందలేదని తెలుసుకుని కంగారు పడింది. ఎప్పటిలాగే నిర్ణీత ప్రదేశంలో ఉంచిన పత్రాలు ఏమయ్యాయో వారికి అర్థం కాలేదు. ఒక వేళ అవి పోలీసుల కంటపడేతే ఎంత ప్రమాదమో కూడా వారికి తెలుసు. తమ పత్రాలు లీక్ అయ్యాయేమో అని అనుమానించిన వాళ్లు ఆ తరువాత మళ్లీ న్యూయార్క్‌లో కలుసుకోలేదు. ఆమె వాషింగ్టన్ నుండి స్పెయిన్‌కు, పారిస్‌కు వెళ్లి అక్కడ డి.ఐ.జి. ఏజెంట్లను కలుసుకునేది. ఈలోగా ఆమెకు పాకిస్తాన్‌కు చెందిన సయీద్‌ఖాన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ ప్రోటోకాల్ అధికారి అయిన అతని ద్వారా ఆమె పరిచయాలు విపరీతంగా పెరిగాయి. కాబినెట్ ఆఫీసర్లు, సెనెటర్లు, అమెరికా ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులూ ఆమె స్నేహితు లయ్యారు.

ఆమె కదలికల్ని జాగ్రత్తగా గమనిస్తున్న ఎఫ్.బి.ఐ. ఈ విషయాలన్నింటినీ దక్షిణాఫ్రికా ఇంటలిజెన్స్ వర్గాలకు తెలియజేస్తూ హెచ్చరికల్ని జారీ చేసింది. తమ ఎంబసీలోని ఒక స్త్రీ క్యూబా గూఢచారిణి అన్న విషయం తెలుసుకున్న దక్షిణాఫ్రికా ఇంటలిజెన్స్ వర్గాలు ఆ కేసు విషయంలో ఎఫ్.బి.ఐ.కి తమ పూర్తి సహకారాన్ని అందించాయి. ఆ తరువాత ఎఫ్.బి.ఐ. అధికారులు జెన్నిఫర్‌ను ఇంటరాగేట్ చేశారు. మొదట ఆమె తను క్యూబా ఏజెంటునన్న విషయం అంగీకరించలేదు కానీ ఎఫ్.బి.ఐ. అందుకు తగిన సాక్ష్యాల్ని చూపించడంతో చివరికి ఒప్పుకోక తప్పలేదు. అయితే ఆమె తను సాగించిన కార్యకలాపాలకు సంబంధించిన ఎలాంటి వివరాల్ని బయట పెట్టలేదు. ఎఫ్.బి.ఐ. ఎక్కువగా ప్రశ్నించకుండానే ఆమెను వదిలేసింది. ఆ తరువాత రెండు రోజులకు ఆమె తనకు తానుగా వచ్చి ఎఫ్.బి.ఐ. అధికారుల ముందు తను కొనసాగించిన గూఢచర్య కార్యకలాపాల గురించి పూర్తిగా చెప్పేసింది.

ఆమె సాగించిన గూఢచర్యం అమెరికాకు పెద్దగా నష్టం కలిగించేదిగా ఉండకపోవడం, పైగా ఆమె అప్రూవర్‌గా మారి తనకు తానుగా అన్ని విషయాలూ బయట పెట్టడంతో ఎఫ్.బి.ఐ. ఆమెను క్షమించి వదిలేసింది.

ఆ తరువాత ఆమె ఎఫ్.బి.ఐ. అధికారుల అనుమతితో తన మాతృదేశమైన దక్షిణాఫ్రికాకు వెళ్లిపోయింది.

●

